కథ

# అమ్మా బొమ్మా

◆ఇంగువ శ్రీకరుణ◆

## "పాపా! ఒక్కసారి వస్తావా?"

ఆమె పిలుపులోని అభ్యర్థనను త్రోసి పుచ్చలేక మెల్లగా లేచి ఆమె గదిలోకి వెళ్ళింది పాపాయి.

పిలవగానే వచ్చిన పాపాయిని చూచి పట్టరాని సంతోషంతో "రా... ఇలా కూర్చో" అంటూ తన ఎదురుగా ఉన్న కుర్చీని పాపాయికి దగ్గరగా లాగింది ఆమె. పాపాయి కూర్చున్నాక... "నా కోసం నీ విలువైన సమయంలో ఒక గంట... జస్ట్ సిక్టీస్ మినిట్స్ ఖర్చు పెడతావా? ఆమె కళ్ళల్లో నీళ్ల సుడులు తిరుగుతూండగా మరోసారి దీనంగా అడిగింది.

"విత్ ప్లెజర్... చెప్పండి" అంది పాపాయి తను కూర్చున్న కుర్చీని ఆమెకు మరింత దగ్గరగా లాక్కుంటూ...

"నా 'పేరు' శ్యామసుందరి. నిరక్షరాస్యురాలిని. నా కథ నీతో చెప్పాలన్పించింది. అందుకే పిలిచాను. నువ్వు కథలు రాస్తూంటావట. ఇక్కడ ఎవరో అనుకుంటుంటే విన్నాను. నా దీనగాథ... అహా... కాదు కాదు నా జీవితకథ రాస్తావా?" కన్నీటి ప్రవాహానికి ఆనకట్ట వేసే ప్రయత్నంగా గలగలా నవ్వుతూ అడిగింది శ్యామసుందరి. ఆ నవ్వు వెనుక ఏడుపును ఆపుకునేందుకు తాపత్రయపడే ఆమె మనసులో ఎంతగానో కల్లోలాన్ని సృష్టించిన బాధ తాలుకూ గాథను తెలుసుకోవాలనిపించింది పాపాయికి.

"అలాగే... తప్పకుండా రాస్తాను చెప్పండి" అంది.

"మా తల్లిదండ్రులకు తొమ్మండుగురు సంతానం. మన దేశానికి స్వతంత్ర్యం రాక పూర్వమే మేము ఆంధ్రా నుండి ఢిల్లీకి వచ్చి అక్కడే స్థిరపడ్డాము. నాకు ఊహ తెలియని రోజుల్లోనే మా తల్లిదండ్రులు బస్సు ప్రమాదంలో మరణించారు. మా పెద్దన్నయ్యే మమ్మల్నందర్నీ పెంచి పెద్ద చేసారు. ముగ్గురు మగపిల్లలూ... ఐదుగురు ఆడపిల్లల తరువాత పుట్టిన ఆఖరి పిల్లను నేనే! కాబట్టి అల్లరి ఎక్కువగానే చేసినా అందరూ భరించేవాళ్ళు. ముఖ్యంగా మా అన్నగారు నన్నెంతో గారంగా చూసేవారు.

తోడపుట్టిన వాళ్ళయైన మా అందరిపట్లా అన్నగారికి అమితమైన ఆపేక్ష వున్నా, ఆయన పెళ్ళి చేసుకున్న నాటి నుంచీ అది అంతకంతకూ అంతం చేయాలని తెగ ప్రయత్నించేది మా వదినగారు. పెళ్ళయిన మూడేళ్లలో ఇద్దరు పిల్లలకి తల్లైయ్యింది. నిజానికి తన కడుపున పుట్టిన బిడ్డలకంటే మా మీదే మమకారం మెండుగా చూపే మా అన్న గారితో అస్తమానం తగవులాడుతూండేది వదిన.

బండెడు సంసారాన్ని తన ఒక్కడి రెక్కల కష్టం మీద నడిపించడానికి ఎంత కష్టపడేవాడో అన్నయ్య అయినా ఏనాడూ తన బాధల్ని భార్యతో పంచుకోవడానికి ఇష్టపడేవాడు కాదు. తను తిన్నా... తినకపోయినా మా అందరికీ కడుపు నిండా రెండు పూట్లా తిండి పెట్టడానికి తిప్పలు పడేవాడు. రెండు జతల బట్టలనే పొదుపుగా జాగ్రత్తగా వాడుకుంటూ మా అందరికీ ఒంటినిండుగా నాలుగైదు జతల దుస్తులు ఏటా ఏర్పాటు చేసేవాడు. అమ్మా... నాన్నా మిగిల్చిన స్థిర... చరాస్తులు ఏమీ లేకపోయినా తోడపుట్టిన మా ఎనిమిదిమందినీ తన స్థిరాస్తిగా భావించి కాపాడుకోవడమే సంతృప్తిగా ఫీలయ్యేవాడు.

వదినగారి విసుర్లు ఒక్క పక్క భరిస్తూనే చిన్నన్నయ్యల్ని, అక్కల్ని చదువుల్లో పెట్టాడు. అన్నయ్య తమకోసం ఎదుర్కొంటున్న సమస్యల్ని అర్థం చేసుకోగలిగే వయసొచ్చిన వాళ్ళందరూ చదువు పట్ల శ్రద్ధాసక్తులు చూపించి మంచి మార్కులు సంపాదించుకుంటూ స్కాలర్ షిప్‌లు తెచ్చుకునే స్థాయికి ఎదిగారు. అన్నయ్యకు కాస్త ఆర్థిక ఇబ్బంది తగ్గింది. వాళ్ళ నిమిత్తం ఆట్టే అప్పులు చేయాల్సిన పరిస్థితులు తప్పడం వలన వదిన కూడా సూటీపోటీ మాటల ధోరణి తగ్గించుకున్నది."

"గ్లాస్ పట్టండి మజ్జిగ తెచ్చాను" అంటూ ఆయా వచ్చి డిస్టర్బ్ చేయడంతో శ్యామసుందరి చెబుతున్న కథను ఆపి ఎడం చేత్తో పక్కనే వున్న కూజాపై బోర్లించిన గ్లాస్ తీసి పట్టుకుంది. ఆయా ఆ గ్లాను నిండా మజ్జిగ నింపి తన పనైపోవడంతో అక్కడ్నించి వెళ్ళిపోయింది.

మజ్జిగ గ్లాస్‌ని పాపాయికి ఇవ్వబోయింది శ్యామసుందరి. "వద్దు మీరు త్రాగండి" అంది పాపాయి.

"ఇక్కడ ఎవరి డ్యూటీ వాళ్ళు చేసుకుపోతారు. మనసు విప్పి ఒకరితో ఒకరు మాట్లాడరు. ఎవరి ధోరణి వాళ్ళదే తప్ప మరొకరి ధ్యాస అక్కర్లేదు. నాకేమో నలుగురితో కలిసిమెలసి వుండాలనిపిస్తుంది. కానీ యాంత్రిక జీవనానికి అలవడ్డ ఇక్కడి మనుషులు అందుకు అవకాశం ఇవ్వరు" అని మజ్జిగ త్రాగసాగింది శ్యామసుందరి.

మనిషితన మనసులో ఉప్పొంగే ఊహాల్నీ, మెదడులో మెదిలే భావాల్నీ చెప్పుకోవడానికి

◆◆◆

**నువ్వు కథలు రాస్తావట. నా జీవిత కథ రాస్తావా?**

◆◆◆

◆◆◆

**ఏనాడూ తన బాధల్ని భార్యతో పంచుకోడానికి ఇష్టపడేవాడు కాదు.**

◆◆◆

అవకాశం ఉండాలి. అందులో పాలు పంచుకునే తోడు కావాలి. నిస్వార్థపూరిత చెలిమిలోని తియ్యదనాన్ని చవి చూపే నిజమైన నేస్తం దొరకాలి. వీటిలో ఏది దక్కకపోయినా జీవితం నిరర్థకం అనిపించడం సహజం. అలాగే శ్యామసుందరిలోనూ నిరాశా నిస్పృహలు పేరుకుపోవడానికి ఏదో బలమైన కారణం వుండే వుంటుంది. అదేమిటో ఆమె కథ పూర్తిగా వింటే తప్ప తెలియదు అనుకుంది పాపాయి.

"నా కథ కొంచెం వినగానే అప్పుడే నా గురించి ఆలోచించడం ప్రారంభించారన్న మాట" అంటూ తాగిన మజ్జిగ గ్లాసుని క్రింద పెట్టి, తిరిగి పాపాయి కళ్ళలోకి సూటిగా చూస్తూ,



"పాపా! నా గురించి మా ఇంట్లో అన్నయ్య తప్ప ఎవ్వరూ ఆలోచించేవారు కాదమ్మా! ఒక్క విశేషం ఏమంటే... అసలు నన్ను స్కూల్లో చేర్పించనేలేదు. అందరికంటే చిన్న పిల్లనైన నేను మా వదిన గారికి ఇంటి పనుల్లో ఆసరాగా వుండేదాన్ని. అంచేత తన బిడ్డల్ని ఆడించే డ్యూటీ నాకు ఒప్పజెప్పేది మా వదిన. నన్ను కూడా స్కూల్లో చేరిస్తే తనకు ఇంటి పనుల్లో సహాయం చేసేవారుండరని మా వదినే నా విద్యాభ్యాసానికి అడ్డు తగిలింది. ఆ విషయంలో వదినతో వాదించలేక అన్నయ్య ఓడిపోయాడు. ఫలితంగా నేను మా ఇంట్లో పనిమనిషి స్థానాన్ని భర్తీ చేసాను.

కాల ప్రవాహంలో ఏళ్ల దొర్లిపోతుంటే, నా సోదరీ సోదరులంతా జీవితాల్లో నిలబడ్డారు. ఉన్నతమైన చదువులు పూర్తి చేసి ఉద్యోగస్తులయ్యారు. వాళ్ళందరికీ పెళ్ళి- పేరంటాలు కూడా జరిగిపోయాయి. ఉద్యోగ రీత్యా ఉన్న వూరు కూడా వదిలి వెళ్ళిపోయారు. అన్నయ్య రిటైరయ్యాడు. అందం, అణుకువ, పని పాటలు తెలిసి వున్నా పొట్ట పొడిస్తే అక్షర జ్ఞానం లేని దాన్నని నన్ను పెళ్ళాడటానికి అన్నయ్య ఆశ మేరకు ఏ వరుడూ రాలేదు. ఆ బెంగతోటే ఆయన కన్ను మూసారు.

వదిన ఒంటరితనాన్ని మర్చిపోవడానికి ఆమెకు అండగా మిగిలిన దాన్ని నేనే. ఆమెకు, ఆమె పిల్లలు ఇద్దరికీ వేళకి సేవలందిస్తూ జీవననావను నెట్టుకొస్తున్న నాక్కు సుడిగుండంలా ఎదురైన సమస్య అన్నయ్య కూతురి పెళ్ళి. వదినకు వున్న కొద్దిపాటి నగలూ అమ్మేసి ఆ పిల్ల పెళ్ళి ఎలాగో జరిపించాము.

కాపురానికి పంపిన కొద్ది నెలలకే కట్నం చాల్లేదంటూ పుట్టింటికి తరిమేశారు ఆమె అత్తింటి వాళ్ళు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మిగతా అన్నలకూ... అక్కయ్యలకూ ఉత్తరాలు రాయించాను. సమాధానంగా వారి సమస్యలేవేవో రాస్తూ, తాము ఏ విధమైన సహకారం అందించలేమంటూ జవాబు లిచ్చారు. ఒకే తల్లి కడుపున పుట్టినా అన్నయ్య మనస్తత్వంలో ఆవగింజంతైనా వారికి మంచితనం అంటలేదని బాధపడ్డాను. వాళ్ళలాగే ఎవరి కర్మకు ఎవరు కర్తలు అని నేను వూరుకోలేకపోయాను.

నాలుగిళ్ళలో వంటపనికి చేరాను. సంవత్సర కాలం పాటు శ్రమించి వచ్చిన సొమ్ము ఇచ్చి అన్న కూతుర్ని అత్తారింటికి సాగనంపాను. అది చాలక తర్వాత వదిన విచారించింది. "నీ రెక్కలు ముక్కలు చేసుకుని నా బిడ్డ కాపురాన్ని



## చూపు తక్కువ నటీమణులు

'ప్రూజాభట్, మమత కులకర్ణి'లు తమకు బాగా తెలుసున్న వ్యక్తులు దగ్గరలో ఉన్నా ఒక్కొక్కసారి 'హలో' చెప్పరట. దాంతో వాళ్ళకు గర్వం పెరిగిపోయిందని అపార్థం చేసుకునే అవకాశం వుంది. అసలు విషయం ఏంటంటే వాళ్ళిద్దరికి చూపు సరిగా కనిపించదట. అందుకే కాంటాక్ట్ లెన్స్ పెట్టుకోకపోతే ఆ సమస్య ఎదురవుతుంది. కనుక వారు చూసినా పలకరించకపోతే వారి తప్పుకాదు సుమా!

నిలబెట్టావు. నీ భవిష్యత్తు ఆదిలోనే అంతం చేసిన రాక్షసిని. స్వార్థంతో నీకు చదువు సంధ్యలు లేకుండా చేసిన నా మీద, నా పిల్లల మీద నువ్వు చూపించిన సానుభూతిని, నువ్వందించిన ప్రేమాభిమానాల్ని పొందటానికి అనర్హురాలిని. అయినప్పటికీ అవసరాలు నన్ను అశక్తురాల్ని చేసాయి. నిన్ను దీవించే చేతుల్తోనే దండం పెట్టాలని వుందమ్మా" అంటూ నమస్కరించింది.

పెంచి పెద్ద చేసిన వాళ్ళని ఆదుకోవడం నా కర్తవ్యం అని చెప్పాను. నా జీవితం తన వల్లే నిష్ప్రయోజనమైనదనుకొని కుమిలిపోసాగింది వదిన. పెద్దన్నయ్య కొడుకు ఎవరికీ చెప్పకుండా తనకు నచ్చిన అమ్మాయిని పెళ్ళాడి ఇంటికి తీసుకొచ్చాడు. వదిన ఇదేమిటని అడగబోతే ఆమెను ఎదిరించాడు. కొడుకుని కాదంటే తన గతి అధోగతి అవుతుందని భయపడి వదిన మౌనాన్ని వహించింది.

మనిషి ఆర్థికంగా తన కాళ్ళ మీద తాను నిలబడాలి. మరో మనిషిపై ఆధారపడితే ఆ బ్రతుకు ఎంత దుర్భరంగా వుంటుందో నా చిన్ననాటి నుంచీ చవి చూస్తూనే వున్నాను. అందరిలా కాకపోయినా కొందరిలాగ కూడా బ్రతికే అవకాశం లేదు నాకు. నిరక్షరాస్యురాలినైన నాకు ఆర్థిక స్వాతంత్ర్యం అసలే లేదు. నాకు చేతనైన పని పాటలు చేసుకుంటూ నిస్సారవంతమైన బ్రతుకు వెళ్ళ మారుస్తున్నాను. అయినా సరే నా కోసం నేను బ్రతకాలి అనిపించేది. వంటపన్లు చేసి సంపాదించే డబ్బులో చాలా భాగం ఇంటి ఖర్చులకే ఖర్చు అయిపోయేది. పదో, పాతికో బ్యాంకుల్లో జమ చేసేదాన్ని. నేను వంట చేసే ఒక ఇంట్లో వాళ్ళ బంధువు అమెరికా నుండి వచ్చాడు.

నాలుగు పదుల వయసు నాపైబడినా యవ్వన ఛాయలు నా నుంచి దూరం కాలేదు. కామంతో కళ్ళు మూసుకుపోయిన ఆ కుర్రాడు వాళ్ళ వంటింట్లో వంట చేస్తున్న నన్ను బలాత్కరించబోయేడు. నాకూ అతనికీ మధ్య జరిగిన పెనుగులాటలో నేనే గెలిచాను. బయటికి పరుగెత్తుతున్న నన్ను చూసి ఆ కాముకుడు కోపం కొద్దీ కత్తి పీట నాపైకి విసిరాడు. బలంగా విసరబడ్డ ఆ పదునైన కత్తి పీట నా ఎడమ కాలును మొదలంటా విరగ్గొట్టింది.

ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో డబ్బుకి ఇచ్చే విలువ ప్రాణమున్న మనిషికి ఇవ్వని సమాజంలో అన్యాయాన్ని న్యాయమని నిరూపించుకున్నాడా అమెరికా అబ్బాయి డబ్బుతో. ఏ గొడవా లేకుండా, ఎవ్వరూ ఏమీ ప్రశ్నించకుండా అతనిచ్చిన డబ్బు అందర్నీ సంతోషపెట్టింది.

కాలు లేని నాకు ఎవ్వరూ తోడుగా నిలువలేదు. తోడబుట్టిన వాళ్ళు అయ్యోపాపం అంటూ ఉత్తరాల్లోనే విచారాన్ని వ్యక్తం చేసారు. కూడా వున్న వదినగారు కొడుక... కోడలికి ఎదురు పలకలేదు గాబట్టి ఏమీ చేయలేనిదయ్యింది.

ఎన్నో ఏళ్ళుగా నా సేవలందుకున్న వారందరూ ఎన్నో రోజులు నాకు సేవ చేయలేకపోయారు. నన్నొక భారంలా భావించి, అందరూ కలిసి నిర్ణయించుకుని సంవత్సరం క్రితం నన్నిక్కడ వదిలి వెళ్ళిపోయారు.

నిశ్చింతగా వున్నారు. నేను బ్రతికినా, పోయినా వాళ్ళకి బాధలేదు. గడిచిన సంవత్సర కాలంలో నా కోసం ఎవ్వరూ ఇక్కడికి రాలేదు. నాకూ అంటూ ఒక్క ఉత్తరం కూడా రాలేదు. నేను వాళ్ళ దృష్టి నుంచి పూర్తిగా తొలగిపోయాను. కానీ నా కోసం నేను బ్రతుకుతున్నాను. కుర్చీలో కూర్చుని చేయగలిగే పనులు చేస్తున్నాను. ఇతరుల కోసం అని చెప్పినా నమ్మని మనుషుల మధ్యన నేను ఇంకా వున్నాను కాబట్టి నా కోసం నేనున్నానని అంటున్నాను" అంటూ కన్నీళ్ళను తుడుచుకుంది శ్యామసుందరి.

ఆమె తన కథ చెప్పడం ముగించేసరికి అప్రయత్నంగా పాపాయి కళ్ళలోంచి రెండు కన్నీటిబొట్లు రాలాయి.

"పాపా! నా కథ తప్పక రాస్తావ్ కదూ?" ఆశగా అడిగింది శ్యామ.

ఊ... తన సహజ తెలివి తేటల్తో నాలుగు భాషలు ఉచ్ఛారణ దోషం లేకుండా మాట్లాడుతూ, లోకజ్ఞానాన్ని, సంస్కారాన్నీ తనలో నిక్షిప్తం చేసుకోగలిగిన స్త్రీమూర్తి శ్యామసుందరి. బ్రతుకు మీద ఆశతో, బ్రతకాలనే తపనతో, తన జీవితాన్ని ఇతరుల కోసం జీవించిన ఆ మనిషికి కాసింత ప్రేమ... అభిమానం... గుర్తింపూ యివ్వని ఆమె తోబుట్టువులూ, సంకుచిత సమాజం సాధించేదేమిటి? మనిషికి... మనసుకి గుర్తింపులేని మానవాకృత రాక్షసుల మధ్యన మనసున్న మనిషికి మనుగడ కష్టమేనా?

"మేడమ్... మీకు అభ్యంతరం లేకపోతే నాకూడా మా ఇంటికి రండి. ఇలా ఒంటరి జీవితాన్ని ఎంతకాలం గడుపుతారు?" తన ఆవేదనను కలగలపి అడిగింది పాపాయి. "దట్స్ నాట్ రైట్ థింగ్ మైడియర్... థాంక్యూ... థాంక్యూ వెరీమచ్ ఫర్ యువర్ కైండ్ యిన్విటేషన్" తల్లి గర్భంలో ఒంటరిగా తొమ్మిది నెలలు వుండి అటు పిమ్మట జన్మించి ఒంటరిగా మరణించే జీవికి ఒంటరితనం కొత్తగాదు. అలాగే నాకు కూడా ఈ జీవితం ఒంటరిగా జీవించడం అలవాటైపోయింది" అంది శ్యామసుందరి.

ఆమె మాటల్లోని నగ్నసత్యాన్ని గ్రహించిన పాపాయి మెల్లగా అక్కడ్నించి బయటికి వచ్చింది.

ఆ రాత్రి పాపాయికి నిద్ర సరిగా పట్టలేదు. నిద్రలో ఉలిక్కిపడి లేచి కూర్చుని ఏడుస్తున్న తన చిట్టిచెల్లిని జోల పాడి మళ్ళీ నిద్రపుచ్చింది. ఓల్డేజ్ హోమ్‌లోని శ్యామసుందరిని ఎంతకీ మర్చిపోలేక కంటికి కునుకు పట్టకపోవడంతో పాపాయి శ్యామ కథను రాయడానికి ఉపక్రమించింది. శ్యామసుందరి కోరిక ప్రకారం ఆమె కథను రాయడం, సాటిస్త్రీగా తన వంతు మానవతను చాటడమే కామోను! ■